సాక్షి తిరుపతి

మంగళవారం : 13 : మే : 2025



డెంగీపై అవగాహన అవసరం

రాబోయే వర్షాకాలంలో డెంగీ వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమని కలెక్టర్ తెలిపారు. - 8లో



రగులుతున్న తమ్ముళ్లు!

నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వలేదని టీడీపీ సీనియర్ నేతలు అధిష్టానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - 8లో



ఆర్మీకి రూ.3.15 లక్షల విరాళం

తిరుపతి ఆటో మొబైల్ అసోసియేషన్ వారు ఆర్మీకి సోమవారం రూ.3.15లక్షల విరాళం అందించారు. - 8లో

న్యూస్‌రీల్

బాల సదనం నిర్వహణకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : సూళ్లూరుపేటలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చెందిన బాలసదనం నిర్వహించేందుకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వసంత బాయి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నిబంధనల మేరకు సదనం నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతిపాదనలు పంపాలని కోరారు. ప్రత్యేక అవసరాలు గల బాలల సంరక్షణలో అనుభవం ఉన్న స్వచ్ఛంద సంస్థలు తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు మూడేళ్ల ఆడిట్ నివేదికలను కలెక్టరేట్‌లోని బి-బ్లాక్ రూమ్ నెంబర్ 505, 506లో ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు అందించాలని సూచించారు.

ఎస్వీయూ విద్యార్థికి అరుదైన అవకాశం



బ్రహ్మారెడ్డిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో పీజీ పూర్తి చేసిన సీహెచ్ బ్రహ్మారెడ్డి అనే విద్యార్థికి విదేశాల్లో పరిశోధనలు చేసే అరుదైన అవకాశం లభించింది. ఇందుకోసం ప్రతి నెలా రూ.లక్ష స్కాలర్‌షిప్ సైతం అందించనున్నారు. ఈ మేరకు బ్రహ్మారెడ్డి సౌత్‌కొరియాలోని పూసన్ నేషనల్ యూనివర్సిటీలోని కెమికల్ మెటీరియల్స్ విభాగంలో పరిశోధనలు చేయనున్నారు. సోమవారం ఈ సందర్భంగా విద్యార్థిని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, ఫిజిక్స్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు అభినందించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పూసన్ వర్సిటీలో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు. ఫిజిక్స్ హెడ్ దేవప్రసాద్‌రాజు సహకారంతోనే పరిశోధనకు ఎంపికైనట్లు వెల్లడించారు. రూ.లక్ష ఉపకార వేతనంతో డివైజ్ ఫ్యాబ్రికేషన్స్‌లో ఓఎల్‌ఈడీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్ డివైజెస్ అనే అంశంపై నాలుగేళ్ల పాటు పరిశోధనలు చేయనున్నట్లు వివరించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ప్రథమ సంవత్సర పరీక్షకు మొత్తం 7427మంది విద్యార్థులకు గాను 6,979 మంది హాజరయ్యారు. సెకండియర్ పరీక్షకు 848మందికి గాను 770 మంది హాజరైనట్లు ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

● రథోత్సవం.. లక్ష్మీనారసింహం



పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఉభయనాంచారులతో కలసి రథంపై విహరిస్తున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి. - రాపూరు

● గరుడ గోవిందం



వైశాఖ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో సోమవారం రాత్రి గరుడవాహనంపై విహరిస్తున్న మలయప్పస్వామి - తిరుమల

● స్వర్ణ శోభితం



తిరుచానూరులో వసంతోత్సవాల్లో భాగంగా స్వర్ణరథంపై అలమేలు మంగమ్మ ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. - చంద్రగిరి

● తిరుపతిలోని చింతల చేను సమీపంలో ఓ భారీ భవనం నిర్మిస్తున్నారు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ నుంచి జీ ప్లస్ త్రీ అనుమతులు తీసుకుని ఏకంగా ఐదు అంతస్తుల భవంతికి శ్రీకారం చుట్టి.. శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఇంతలో ప్లానింగ్ సెక్రటరీ పరిశీలనకు వచ్చారు. నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలని అల్టిమేటం జారీ చేశారు. మిమ్మల్ని మా సార్ రమ్మంటున్నారు. ఒకసారి ఆఫీస్‌కి వెళ్లి కలవండి అంటూ సలహా ఇచ్చారు. చేసేది లేక సదరు భవన నిర్మాణదారుడు రెండు రోజుల తర్వాత ప్లానింగ్ ఆఫీసర్‌ని కలిసి ప్రసన్నం చేసుకున్నాడు. దీంతో అక్రమ నిర్మాణం.. వెంటనే సక్రమం అయిపోయింది.

● స్థానిక కరకంబాడి రోడ్డులోని డీమార్ట్‌కు ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఆ కట్టడానికి సెట్ బ్యాక్ వదలలేదు. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ అధికారి ఈ అక్రమ నిర్మాణానికి అన్నీ తానై సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ భవనానికి సమీపంలోనే ఓ ఇంటి వద్ద నాలుగు అడుగుల ముందుకు రేకులు వేసుకున్నారు. ఈ విషయం గమనించిన స్థానిక ప్లానింగ్ సెక్రటరీ కొంత నగదు డిమాండ్ చేశారు. ఆయన అడిగినంత సొమ్మును ఇవ్వకపోవడంతో కక్షగట్టినట్టు ఇంటి ముందు రేకులను తొలగించి తమ ప్రతాపం చూపించారు.





తిరుమల బైపాస్ రోడ్డు మారుతీ నగర్‌లో నిర్మిస్తున్న భవనం

పైసలకే ప్లానింగ్



తిరుపతి నగరంలో ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా వందలాది భవనాలు నిర్మిస్తూనే ఉన్నారు. రూ.లక్షలు ముట్టజెప్తున్న వారికి మాత్రం అధికారులు కొమ్ముకాస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారి నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారు. కొన్ని చోట్ల కట్టడాలను పడగొట్టేస్తున్నారు. అయితే కాసులిస్తే మాత్రం అక్రమ నిర్మాణాలను సైతం సక్రమమే అంటూ పచ్చజెండా ఊపేస్తున్నారు. స్వయంగా పర్యవేక్షిస్తూ భవనాల పనులు పూర్తి చేయించేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ కార్పొరేషన్ ఉన్నతాధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా పైసల కోసం ప్లానింగ్ అధికారులు, సిబ్బంది యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

తిరుపతిలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాలు
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న లంచావతారులు
- కాసులిస్తే ఇష్టారాజ్యంగా అనుమతులు
- చేయి తడపకుంటే తప్పని అడ్డగింతలు
- పర్యవేక్షణను గాలికి వదిలేసిన ఉన్నతాధికారులు

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. నగరంలో గడిచిన మూడు నెలల్లోనే 600 మందికి పైగా భవన నిర్మాణదారులకు ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ భవనాలన్నీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్లానింగ్ సెక్రటరీలు రంగలోకి దిగేశారు. నోటీసులు జారీచేసిన భవనాల వద్దకు వెళ్లి ఎక్కడికక్కడ పనులు నిలిపేవేయాలని హుకుం జారీ చేశారు. ఒకసారి ఆఫీసుకు వెళ్లి మా సార్ ను కలవండి .. మీరు ఏదైనా మాట్లాడుకోవాలి అంటే అక్కడే మాట్లాడుకోండి. అప్పటివరకు పనులు చేయొద్దు అంటూ భవన యజమానులను ఆదేశించారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో భవన యజమానులు గడిచిన మూడు నెలలుగా ప్లానింగ్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో భవనాల డిమాండ్ మేరకు కాసులు ఇచ్చుకున్న వారికి అధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. వారి నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేసుకుంటున్నారు. కొంతమంది భవన యజమానులు రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకుని, అధికారులకు కూడా కాస్త మామూళ్లు చదివించుకుని పనులు సాగిస్తున్నారు. ఈ అవినీతి తంతు తెలియని మరి కొందరు యజమానులు ఇప్పటికీ పనులు చేసుకోలేక కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతి పనికీ డబ్బులతో ముడిపెడుతుండడంతో భవన నిర్మాణాల చేపట్టాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపుతూ భవన యజమానులను ఇబ్బందులు పెడుతున్నారు. తమకు సహకరిస్తే ఎన్ని అంతస్తులైనా నిర్మించుకోవచ్చు అని టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మొహమాటంగా చెబుతున్నారు.



శరవేగంగా నిర్మిస్తున్న భారీ భవనం



తిరుపతి రిజిస్ట్రేషన్ కాలనీలో..

రూ.కోట్ల ఆదాయానికి గండి

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం ద్వారా, వాటికి సక్రమ పద్ధతుల్లో అనుమతులు మంజూరు చేయడం ద్వారా కార్పొరేషన్‌కు రూ.కోట్ల ఆదాయం వస్తుంది. అయితే టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటం కారణంగా నగరపాలక సంస్థ రాబడికి గండిపడుతోంది. కమిషనర్ మౌర్య నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్వచ్ఛ నగరంగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్నారు. ఈక్రమంలోనే అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే, అవినీతి పరులకు చెక్ పెట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు.

సెక్రటరీలే మధ్యవర్తులు

కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ అధికారులు తమ అవినీతి సంపాదనకు వార్డు ప్లానింగ్ సెక్రటరీలను మధ్యవర్తులుగా వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై భవిష్యత్‌లో ఏమైనా విచారణ చేపడితే తాము తప్పించుకునేందుకు సెక్రటరీలను బలి పశువులుగా వాడుకుంటున్నట్లు సమాచారం. తమపై వేటు పడుతుందేమో అని ఆందోళనతో కొందరు సెక్రటరీలు బతిమాలుకున్నప్పటికీ అధికారులు మాత్రమ ససేమిరా అంటున్నట్లు తెలిసింది. మేం చూసుకుంటాం.. మీకేం ఇబ్బంది ఉండదు అని ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడవుతోంది.





అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమార్జనే లక్ష్యంగా కూటమి నేతలు అడుగులు వేస్తున్నారు. అందినకాడికి దోచుకునేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. అందులో భాగంగా బీసీ కార్పొరేషన్ కింద మహిళలకు అందించే కుట్టుమిషన్ల నిధులను స్వాహా చేసేస్తున్నారు. బినామీ పేర్లతో భారీ అవినీతికి పాల్పడుతున్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన నగదులో దాదాపు 60శాతం కాజేస్తున్నారు. దీనిపై బీసీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

కనికుట్టు

కుట్టు మిషన్ల నిధుల స్వాహా

- బినామీ పేర్లతో అక్రమాలకు పాల్పడుతున్న కూటమి నేతలు
- మొత్తం 144 ట్రైనింగ్ సెంటర్లకు గాను 25 మాత్రమే ఏర్పాటు
- శిక్షణ ఇవ్వకుండానే మిషన్లు కొట్టేసే యత్నం
- ఒక్కో మహిళ పేరిట రూ.15,700 కాజేసేందుకు సన్నద్ధం
- మండిపడుతున్న బీసీ సంఘాలు

తిరుపతి అర్బన్ : జిల్లాలో మొత్తం 144 కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం రెండు నెలల క్రితమే ఆదేశాలు జారీ చేసింది. బీసీ కార్పొరేషన్ కింద ఒక్కో సెంటర్‌లో 42 మంది నిరుపేద బీసీ మహిళలకు శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తొలి ప్రాధాన్యతగా పాదుపు సంఘంలోని మహిళలకు ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉంది, అయితే ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 25 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగిలిన 119 శిక్షణ కేంద్రాల సంగతి పూర్తిగా మరిచారు. శిక్షణ సమయంలో వసతులను తూతూమంత్రంగా కల్పించారు.

నిబంధనలు తుంగలో తొక్కి...

కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీలో నిబంధనలను తుంగలో తొక్కినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శిక్షణ ఉదయం 4 గంటలు, మధ్యాహ్నం 4 గంటలపాటు ఇవ్వాల్సి ఉంది. వారంలో 6 రోజులు శిక్షణ ఉంటుంది. అలా మొత్తం 45 రోజుల్లో 360 గంటలు శిక్షణ ఇవ్వాలి. తర్వాత కుట్టు మిషన్లు అందించాలి. అయితే కూటమి నేతలు పలువురు బినామీలను రంగంలోకి దించి, అసలు శిక్షణకు రాకుండానే మిషన్లు కాజేసేందుకు యత్నిస్తున్నారని తెలిసింది. కుట్టు శిక్షణతోపాటు మిషన్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం మూడు విడతల్లో నిధులు విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియలోనూ నిబంధలను గాలికి వదిలేసినట్లు సమాచారం.

రూ.కోట్లు కొట్టేసే దిశగా..

ఒక్కో మహిళకు కుట్టు శిక్షణతోపాటు మిషన్ జారీ చేయడానికి ప్రభుత్వం రూ.23 వేలు మంజూరు చేసింది. జిల్లాలో 144 కేంద్రాల్లో ఒక్కో కేంద్రానికి 42 మంది చొప్పున 6,048 మందికి రూ.13.91 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ఒక్కో మహిళ శిక్షణకు రూ.3వేలు, మిషన్‌కు రూ.4,300 లెక్కన రూ.7,300 మాత్రమే వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన రూ.15,700 కూటమి నేతలు స్వాహా చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన రూ.9.49 కోట్లు కొట్టేసేందుకు కుట్రలు పన్నుతున్నారని జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది.

మోసం చేసింది



కూటమి ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోంది. కుట్టు శిక్షణతోపాటు మిషన్‌కు ఒక్కో బీసీ మహిళకు రూ.23 వేలు కేటాయించాల్సి ఉంది. అయితే శిక్షణకు రూ.3వేలు, మిషన్‌కు రూ.4300 మాత్రమే ఖర్చు చేసింది. మిగిలిన మొత్తాన్ని కూటమి నేతలు నొక్కేస్తున్నారు. ఈ అంశంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.

– గీతా యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నేత

అర్హులకు అవకాశం లేదు



నిజమైన పేదలకు అర్హులైన వారికి అవకాశం ఇవ్వలేదు. కుట్టుమిషన్ల ఇవ్వడం ద్వారా వారి కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని ఈ స్కీమ్ ఏర్పాటు చేశారు. అయితే కూటమి నేతలు ఎవరి పేరు సిఫార్సు చేస్తే వారి పేర్లు మాత్రమే నమోదు చేసుకున్నారు. మరోవైపు కుట్టుమిషన్లలోను అవినీతికి పాల్పడ్డారంటేనే తెలుస్తోంది కూటమి నేతల చిత్తశుద్ధి.

- విజయలక్ష్మి, తిరుపతి

ఫిర్యాదు చేశాం



రాష్ట్ర వ్యాప్తంగా కుట్టుమిషన్ల విషయంలో అవినీతి జరిగింది. 60శాతం నిధులు కొట్టేస్తున్నారు. దీనిపై డీఆర్‌ఓ నరసింహులుకు ఫిర్యాదు చేశాం. బీసీ మహిళలకు న్యాయం చేయాలని కోరుతున్నాం. కూటమి నేతలకు చిత్తశుద్ధి ఉంటే బహిరంగంగానే ఈ అంశంపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

- పుల్లయ్య బీసీ సంఘం రాష్ట్ర నేత

త్వరలోనే అన్ని సెంటర్లు



కుట్టు శిక్షణకు సంబంధించి జిల్లావ్యాప్తంగా త్వరలోనే అన్ని సెంటర్లను అందుబాటులోకి తీసుకువస్తాం. 144 సెంటర్లకు ప్రస్తుతం 25 సెంటర్లలో శిక్షణ ఇస్తున్నాం. అర్హులైన వారినే ఎంపిక చేశాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాం. లోటుపాట్లు ఉంటే వాటిని సవరించుకుని అందరికీ న్యాయం చేస్తాం.

– శ్రీదేవి, ఈడీ, బీసీ కార్పొరేషన్

అతీగతీ లేక తగ్గిన వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



అర్జీదారులు లేక ఖాళీగా కుర్చీలు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఉన్నతాధికారులకు అందించిన వినతులకే అతీగతీ లేకుండా పోతోందని అర్జీదారుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. అందుకే కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీదారుల సంఖ్యల తగ్గిపోతోంది. వ్యయప్రయాసలకోర్చి వచ్చి వినతులు సమర్పిస్తే ఎలాంటి ఫలితం ఉండడం లేదనే భావన ప్రజల్లో రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలం 238 అర్జీలే వచ్చాయి. ఇది వరకు కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులను కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు అర్జీదారులు బారులు తీరేవారు. ఈ గ్రీవెన్స్‌లో ఆ పరిస్థితి కనిపించలేదు. కలెక్టర్‌తో పాటు జేసీ, డీఆర్‌ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరైనప్పటికీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉన్నప్పటికీ జనం పలుచగానే కనిపించారు. ఈ క్రమంలోనే ప్రజా సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగేలా వినతులను సత్వరం పరిష్కరించాలని సూచిస్తున్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 86 అర్జీలు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 86 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


కేశవులు మృతదేహం

చంద్రగిరి:పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై అగరాల సమీపంలో సోమవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. అగరాల పంచాయతీ వినాయక నగర్‌కు చెందిన కేశవులు(55) బహిర్భూమికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వంలో అవగాహన సదస్సు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లో ని విశ్వం విద్యాసంస్థలో బుధవారం ఉదయం 10గంటలకు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ అవగాహన సదస్సుకు 4 నుంచి 9వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరంలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ అన్‌లోడింగ్ పూర్తయిన తర్వాత పార్కింగ్ చేస్తుండగా వాహనం పై భాగంగా విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో కరెంట్ షాక్ తగిలి ఐరాల మండలం మద్దిపట్టువారిపల్లెకు చెందిన లారీ డ్రైవర్ ఈశ్వర్(50) అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

రగులుతున్న తమ్ముళ్లు!



నామినేటెడ్ పోస్టుల భర్తీపై టీడీపీ సీనియర్ నేతలు తీవ్రమైన అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలందిస్తే కనీస గౌరవం దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. కూటమి గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తే అసలు గుర్తింపే లేకుండా పోయిందని వాపోతున్నారు. ఎన్నికల ముందు కండువా కప్పుకున్న వారికే పదవులు కేటాయించడంపై మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు నాయకులు తమ స్థాయికి తగని పోస్టులు కట్టబెట్టడంపై కినుక వహిస్తున్నారు. ఇంత కాలం ఎదురుచూసినందుకు ఇంతగా అవమానిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నామినేటెడ్ పదవుల పందేరంపై అసంతృప్తి
- గుర్తింపు.. గౌరవం లేదని సీనియర్ నేతల ఆవేదన
- ప్రాధాన్యం లేని పోస్టులు కట్టబెట్టడంపై మండిపాటు
- తిరుపతి, చిత్తూరు జిల్లాల టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు గుర్తింపు, గౌరవం రెండూ లేవని కొందరు టీడీపీ నేతలు మదనపడుతున్నారు. మొదటి నుంచి పార్టీ విజయం కోసం పనిచేసిన తమను కాదని ఎన్నికల ముందు చేరిన వారికి ఉన్నత పదవులు కట్టబెట్టడంపై మండిపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అతి ముఖ్యమైన తుడా చైర్మన్ పదవిని డాలర్స్ దివాకర్‌రెడ్డికి, మొన్న డీసీసీబీ చైర్మన్ పోస్టును అమాస రాజశేఖరరెడ్డికి ఇవ్వడంతో నామినేటెడ్ పదవులన్నీ దాదాపు భర్తీ పూర్తయినట్లేనని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ రెండు పదవులు తమకే వస్తాయని ఆశగా ఎదురుచూసిన టీడీపీ సీనియర్ నేతలు నైరాశ్యంలో మునిగిపోయారు. ఇక నామినేటెడ్ పదవుల్లో ఆశించేందుకు ఏమీ లేకుండా పోయినట్లేనని ఆగ్రహంగా ఉన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో టీడీపీలో అనేక మంది సీనియర్ నేతలు ఉన్నారు. అలాగే టీడీపీ కోసం తెరవెనుక నుంచి పనిచేసిన కాంట్రాక్టర్లు కూడా ఉన్నారు. వారంతా ముందుగా టీటీడీ పాలకమండలి సభ్యత్వం కోసం పోటీపడ్డారు. అలా ఆశించిన వారిలో జిల్లాకు చెందిన టీడీపీ నేతలెవరికీ టీటీడీ పాలకమండలిలో చోటు దక్కలేదు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ద్వారా బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ బోర్డు మెంబర్ పోస్టును ఎగరేసుకుపోయారు. ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీనే నమ్ముకుని ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారందరికీ భంగపాటు తప్పలేదు.

చిత్తూరు జిల్లాలోనూ..

చిత్తూరు జిల్లా పరిధిలోని కుప్పం, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు, నగరి నియోజక వర్గాల్లో పదుల సంఖ్యలో ఉన్న టీడీపీ నాయకులందరికీ కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించింది. డీసీసీబీ చైర్మన్ పదవి కోసం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చాలా నమ్మకంగా ఉన్నారు. జిల్లాలో సీనియర్ నాయకుల్లో ప్రథముడు. టీడీపీనే నమ్ముకుని ఉన్నారు. అయితే దొరబాబుని కాదని, అమాస రాజశేఖరరెడ్డికి చైర్మన్ గిరీ కట్టబెట్టారు. ఆయన గతంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న సమయంలో అడ్డగోలుగా కుప్పం నియోజక వర్గానికి నిధులు కేటాయించారే విషయాన్ని పరిగణలోకి తీసుకున్న చంద్రబాబు, లోకేష్ మళ్లీ అమాసకే డీసీసీబీని కట్టబెట్టారు. అమాస కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరినట్లు కూడా పెద్దగా ప్రచారం లేదు. అదే విధంగా టీడీపీ కోసం పెద్దగా ప్రచారం చేసిన దాఖలాలు కూడా లేవని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాలో మిగిలింది కాణిపాకం, బోయకొండ పాలకమండళ్లు మాత్రమే. ఆయా బోర్డుల చైర్మన్, సభ్యత్వం కోసం అనేక మంది ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. అందులోనైనా న్యాయం జరుగుతుందా? లేదా? అని పలువురు టీడీపీ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లందరికీ అవమానం

తిరుపతికి చెందిన ఎన్టీఆర్ రాజు కుటుంబం ఎన్నో ఏళ్ల నుంచి టీటీడీ బోర్డు సభ్యత్వం కోసం ఎదురుచూస్తూనే ఉంది. ఈ సారి కూడా ఆ కుటుంబానికి దక్కలేదు. తిరుపతిలో టీడీపీ అంటే గుర్తొచ్చే నాయకుల్లో ముందు వరుసలో ఉండేది నరసింహయాదవ్. టీడీపీ సీనియర్ నేతగా పచ్చ చొక్కా తప్ప మరొకటి ధరించని నరసింహ యాదవ్ మరో పర్యాయం తుడా చైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఆయనకు ప్రాధాన్యం లేని పదవిని కట్టబెట్టి తీవ్రంగా అవమానించారు. టీడీపీలో మరో నేత మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ. ఆమె ఎమ్మెల్సీ లేదా టీటీడీ పాలకమండలి సభ్యత్వం, అది కూడా కాకుంటే తుడా చైర్మన్ పదవిని ఆశించారు. అయితే ఈ మూడింటిలో ఏదీ దక్కలేదు. అస్సలు ఎలాంటి ప్రాధాన్యత లేని, ఆ పదవి ఒకటి ఉందనే విషయం తెలియని గ్రీనింగ్ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో పాటు, ఆమె అనుచరులంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. తిరుపతి జిల్లాలో అతిముఖ్యమైన తుడా చైర్మన్ పదవిని రియల్ ఎస్టేట్ వ్యాపారికి కట్టబెట్టడంపై టీడీపీలోని అనేక మంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దివాకర్‌రెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, అందుకు సంబంధించిన వివరాలతో అమరావతికి లేఖ పంపినట్లు తెలిసింది. పార్టీ కోసం నమ్మకంగా పనిచేస్తున్నా తమను గుర్తించలేదంటూ కొందరు నాయకులు అధిష్టానంపై కారాలు మిరియాలు నూరుతున్నారు. అదే విధంగా శాప్ చైర్మన్ రవినాయుడుపైనా కొందరు టీడీపీ నేతలు అమరావతికి ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతి జిల్లాలో మిగిలిన శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి కోసం పలువురు టీడీపీ నేతలు ఎదురుచూస్తున్నారు.

ఆర్మీకి రూ.3.15 లక్షల విరాళం

తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్: ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్లకు మద్దతుగా ఆర్మీకి తిరుపతి ఆటో మొబైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.3.15 లక్షల విరాళం అందజేశారు. ఈ డీడీని హోండా మోటార్స్ పృథ్వీ చేతుల మీదుగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు.

వెకేషన్ కోర్టు రెండో షెడ్యూల్ విడుదల

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సివిల్ కోర్టులకు హైకోర్టు మంగళవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. ఈ క్రమరంలో అత్యవసర కేసులను దాఖలు చేసుకోవడానికి వెకేషన్ కోర్టు రెండో షెడ్యూలు న్యాయమూర్తి, తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించే షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 30 జూన్ 6, 13 తేదీల్లో చిత్తూరులో, తిరుపతిలో ఈనెల 29 జూన్ 3, 5,10,12, మదనపల్లెలో జూన్ 2, 9 తేదీల్లోనూ, పీలేరులో జూన్ నెల 4వ తేదీ, శ్రీకాళహస్తిలో 11 తేదీన విధులు నిర్వహించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెకేషన్ కోర్టు మొదటి షెడ్యూలు ఇదివరకే విడుదలైన విషయం తెలిసిందే.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

పాకాల : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై తోటపల్లి క్రాస్ వద్ద ఏప్రిల్ 25వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రిశ్విన్(14) అనే బాలుడు సోమవారం మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: వెంకటగిరిలో ఈ నెల 15న నిర్వహిస్తున్న జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. 5వ తరగతి నుంచి పీజీ వరకు అర్హులన్నారు. అదనపు సమాచారం కోసం 7013509543, 9491458910, 9988853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం, జిల్లా సచివాలయాల అధికారి జగదీష్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

రెండు బైక్‌ల ఢీ : ఇద్దరి మృతి

నాగలాపురం : మండలంలోని బైటకొడియంబేడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. బైటకొడియంబేడు ఎస్టీ కాలనీకి చెందిన మణి(38) తన బైక్‌పై నాగలాపురం వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. శ్రీ సిటీలోని ఓ కంపెనీలో పని చేస్తున్న బీహార్‌కు చెందిన గులాబ్(22) బైకులో వస్తుండగా, ఇరువురూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ఘటనాస్థలంలోనే మరణించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

తిరుపతి అర్బన్: తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్–1 సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న నీరజను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆమె ఇటీవల వాణిజ్య భవనం రిజిస్ట్రేషన్ విషయంలో నివాస భవనంగా మార్పు చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు డీఐజీ గిరిబాబుకు ఫిర్యాదులు అందాయి. ఆయన విచారణ చేపట్టారు. అలా రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడిందని భావించి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో తిరుపతి జాయింట్–2 సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవికి జాయింట్–1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె ఆధ్వర్యంలో సోమవారం రిజిస్ట్రేషన్లు నిర్వహించారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి

తడ : మండలంలోని పల్లెపాళెం వద్ద సోమవారం పిడుగుపాటుకు గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక సున్నపుబట్టీవీధికి చెందిన ఇరుదయ్యానాధన్ డేవిడ్(26) తన తమ్ముడు మరియదాస్, అదే వీధికి చెందిన భాను, విజయ్‌తో కలిసి పల్లెపాళెంలోని మైదానంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. ఇంతలో ఉరుములు మెరుపులతోపాటు ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో డేవిడ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా డేవిడ్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల కోసం టీచర్ల నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తిరుపతి అర్బన్ : ఉపాధ్యాయులకు బదిలీలతోపాటు ఉద్యోగోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీజీ రాజశేఖర్, ముత్యాల రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ వద్ద టీచర్లతో కలిసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయుల నియామకాలు ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకు వినతి పత్రం సమర్పించారు. యూటీఎఫ్ నేతలు దండు రామచంద్రయ్య, కుమారస్వామి, గీతమ్మ, మోహన్ బాబు, సూర్య ప్రకాష్, బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, మస్తానయ్య, పద్మజ, హేమంబరధరరావు, ఆదినారాయణ, గోవర్ధన రెడ్డి పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన అవసరం

తిరుపతి అర్బన్: వచ్చే వర్షాకాలంలో డెంగీ జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు ఆదేశించారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా బ్యానర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ డెంగీ గురించి అవగాహన పెంచడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఈనెల 16న జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ముందు, వర్షాకాలంలో డెంగీ కేసులు పెరుగుతూ ఉంటాయని, ఈ క్రమంలో ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడానికి డెంగీ దినోత్సవం జరుపుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆనందమూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఐడీఎస్‌తో స్విమ్స్ ఒప్పందం

తిరుపతి తుడా: విశాఖపట్నంకు చెందిన ఐడీఎస్ డేటా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో స్విమ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం స్విమ్స్ వీసీ, డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌తో ఆ సంస్థ ప్రతినిధులు సమావేశమై చర్చించారు. హాస్పిటల్ పలు అంశాలపై సహాయ సహకారాలను అందించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్ తెలియజేశారు. ఎంఓయూ ద్వారా ఉచితంగా స్విమ్స్‌లో ల్యాబ్ సౌకర్యం, పరిశోధన, ఆవిష్కరణ, విస్తరణకు ఎంతో ఉపయోగకరమన్నారు. హెల్త్ కేర్ మెడికల్ సైన్స్ కోసం, స్విమ్స్ విద్యార్థులు, అధ్యాపకుల డేటాను సమీకరించడానికి, యూజీ, పీజీ పరిశోధన, ఆచరణాత్మక కోర్సుల్లో ల్యాబ్ సౌకర్యాలను వినియోగించడానికి పేషంట్ డేటాను నమోదు చేసే విషయంలో ఆ సంస్థ సహకారం కీలకంగా ఉంటుందన్నారు. అనంతరం ఐడీఎస్ సంస్థ ప్రతినిధులు, స్విమ్స్ అధికారులు ఒప్పందపు పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఉపాధ్యక్షులు అరవింద్ ఓరుగంటి, ట్రాయ్ మాజీ కార్యదర్శి వి రఘునందన్, స్విమ్స్ నెట్‌వర్క్ ఇంజినీర్ ప్రణయ్ తేజ, స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కళావత్, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రమేష్ చంద్ర, వైద్యులు పాల్గొన్నారు.


ఐడీఎస్ సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న డైరెక్టర్ ఆర్వీ కుమార్

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ


కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓతో దివ్యాంగులు

తిరుపతి అర్బన్: దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు చేతుల మీదుగా నిర్వహించారు. జిల్లాలో వేలాదిమంది దివ్యాంగుల్లో డిగ్రీ చదువుతున్న 24 మందికి ల్యాప్‌టాప్‌లు ఇంటర్మీడియట్ చదువుకున్న 24 మందికి స్మార్ట్ ఫోన్లు అందించారు. దివ్యాంగుల వెల్ఫేర్ స్కీమ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వై.శ్రీనివాసులు, సీఆర్ అండ్‌ఎమ్ ఓజీకే రాజశేఖర్ వెల్లడించారు. ఒక్కో ల్యాప్‌టాప్ విలువ రూ.42వేలు, ఒక్కో స్మార్ట్ ఫోన్ విలువ రూ.16వేలుగా పేర్కొన్నారు.

విద్యుత్ పథకాలపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ పథకాల అమలుపై కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ వ్యవసాయం రంగంలో విద్యుత్ నష్టాలను తగ్గించడమే ఆర్‌డీఎస్‌ఎస్ పథకం లక్ష్యమన్నారు. జిల్లాలో 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్స్ ఉన్నాయని తెలిపారు. అందులో గృహ, వాణిజ్య, పరిశ్రమలకు సంబంధించిన సర్వీసులను స్పష్టంగా విభజన చేయాలని సూచించారు. జిల్లాలో6213 వ్యవసాయ పంపు సెట్లకి 142 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పీఎం కుసుం ద్వారా 28 మెగా వాట్స్ సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. రైతులకు పగటిపూట విద్యుత్‌ను సరఫరా చేయడం కోసం పీఎం కుసుం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేంద్రనాయుడు, ఈఈలు వాసవి, లత, బాలాజీ పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి మహోన్నతం


జ్యోతి ప్రజ్వలనలో అతిథులు, నర్సింగ్ సిబ్బంది, వైద్యులు

తిరుపతి తుడా : వైద్య రంగంలో నర్సింగ్ వృత్తి మహోన్నతమైనదని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని సోమవారం స్విమ్స్ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ స్వచ్ఛంద సేవకురాలిగా సమాజానికి నర్సింగ్ సేవలందించి వృత్తికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టారని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని నర్సులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ రోగులకు సేవలందించాలని సూచించారు. కరోనా కాలంలో స్విమ్స్‌లో నర్సులు అందించిన సేవలను వెలకట్టలేమని కొనియాడారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధారాణి, కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, ఫార్మా కాలేజీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎర్రమ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ కాంతమ్మ, హెడ్ నర్స్ సునీత, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి


రాధాకృష్ణ మృతదేహం

శ్రీకాళహస్తి: పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో మృతి చెందాడు. సత్యవేడు మండలం పాలగుంట గ్రామానికి చెందిన రాధాకృష్ణ(41) శ్రీకాళహస్తీశ్వరాలయం వద్దకు వచ్చాడు. పూటుగా మద్యం తాగి మత్తులో నాలుగో గేటు సమీపంలో ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయం వద్ద నిద్రించాడు. గొంతెండడంతో నిద్రలోనే మృతిచెందాడు. భక్తులు గుర్తించి వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దర్యాప్తు చేసిన సీఐ గోపి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,423 మంది స్వామివారిని దర్శించుకోగా 29,361 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.4 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లో చోరీ

– 80 గ్రాముల బంగారు నగల అపహరణ


చోరీ జరిగిన వైఎస్‌ఆర్‌సీపీ నేత జగదీశ్వరరెడ్డి ఇల్లు

తిరుపతి రూరల్ (తిరుచానూరు) : తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలోని వైఎస్సార్‌సీపీ నేత చొక్కారెడ్డి జగదీశ్వరరెడ్డి ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. జగదీశ్వర్‌రెడ్డి హైదరాబాదులో నివాసముంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంతో పిల్లలను మల్లంగుంటలోని ఇంటిలో ఉంటున్న తన తల్లి నరేంద్రకుమారి వద్దకు పంపించారు. పైఅంతస్తులోని పడకగదిలో పిల్లలు పడుకోగా, కింద ఓ గదిలో నరేంద్రకుమారి నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు గుట్టు చప్పుడు కాకుండా బీరువా తెరిచి బంగారు ఆభరణాలు అపహరించారు. సోమవారం ఉదయం నరేంద్రకుమారి నిద్రలేచి చూడగా బీరువా ముందు దుస్తులు చిందరవందరగా పడునాయి. లోపల దాచిన 80 గ్రాముల బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తిరుపతి రూరల్ పోలీసులు, వేలిముద్రల నిపుణులు ఆ ఇంటికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.